యూరియా కోసం అగచాట్లు

- అన్నదాతలకు తప్పని తిప్పలు
- గంటల తరబడి రైతుల బారులు..

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ప్రజాశక్తి -యంత్రాంగం

యూరియా కొరతతో అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. తెల్లవారుజాము నుంచే ఆధార్‌కార్డు పట్టుకొని క్యూ లైన్ లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజంతా నిల్చున్నా ఒక్క బస్తా కూడా దొరక్క వెనుతిరుగుతున్నారు. పురుగు మందులు దుకాణాల యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై ప్రయివేట్ దుకాణాల వద్ద ముందుగా టోకెన్లు ఇచ్చి క్రమ పద్ధతిలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్నం, నీళ్లు లేకుండా ఎండలో నిరీక్షించినప్పటికీ చాలామంది రైతులుకు యూరియా దొరక్క నిరాశతో వెనుదిరుగుతున్నారు. జిల్లా ఉనతాధికారులతో పాటు, వ్యవసాయ అధికారులు సరిపడా యూరియాను రైతు సేవా కేంద్రాల వద్దకు నేరుగా చేరే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నాట్లు వేసి రోజులు గడుస్తున్నా ఎరువులు లేకపోవడంతో చేలు ఎదుగుదల ఉండదని రైతులంతా ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం అందరికీ యూరియా అందిస్తామని అంటున్నారు.

విజయనగరంజిల్లా గజపతినగరం రైతు సేవా కేంద్రం 2 వద్ద శనివారం వ్యవసాయ అధికారులు వారి సిబ్బంది స్లిప్పులు పంపిణీ చేసి, మెంటాడ రోడ్డు లో ఉన్న సత్య ట్రేడర్స్ గొడౌన్లో యూరియా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున 267 బస్తాలు పంపిణీ చేశారు. కాలం రాజుపేట, పిడిశిల , పాత శీరంగరాజుపురం, కొత్త శ్రీరంగరాజుపురం, డోలపాలెం, సీతారాంపురం గ్రామంలో రైతు సేవ కేంద్రాల వద్ద 267 యూరియా బస్తాలు పంపిణీ చేసినప్పటికీ కొంతమంది రైతులు యూరియా అందక వెనుతిరిగారు. గజపతినగరం పిఎసిఎస్‌లో నిల్వ ఉన్న 267 యూరియా బస్తాలను తెల్లవారుజాము నుంచి వ్యవసాయ అధికారులు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది సహకారంతో ఇ-పాస్ యంత్రాల్లో ఆధార్ నమోదు చేసి రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. డెంకాడ మండల కేంద్రంలో పిఎసిఎస్ వద్ద పోలీసు పహరాలో రైతులకు యూరియాను అందజేశారు. యూరియా కోసం వెళ్తే యూరియాతోపాటు సుమారు 500 నుంచి 1000 రూపాయల వరకు ఇంకొక ఎరువును అంటగట్టి యూరియా ఇస్తున్నారని , వ్యవసాయ అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు చెబుతున్నారు. అరకొరగా యూరియా వచ్చినా అధికారులు వారికి కావాల్సిన వారికే ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎంత భూమి ఉన్నా ఒక బస్తా మాత్రమే ఇవ్వడంతో ఏం చేయాలో రైతులకు పాలుపోవడం లేదని, రైతు పేరు మీద ఒక వన్ బి మాత్రమే ఉంటుందని, అధికారులు వన్‌బికి ఒక బస్తా చొప్పున ఇస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. డెంకాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద ముందస్తుగా పోలీసు బందోబస్తుతో మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత ఆధ్వర్యంలో యూరియాను రైతులకు పంపిణీ చేశారు.

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలోని ఐలవరం గ్రామానికి శనివారం సాయంత్రం యూరియా లారీ రాగా దానిలో 220 కట్టలు సచివాలయం-1సమీపంలోని ఆర్ఎస్‌కె వద్ద దించారు. రైతు ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నప్పటికీ ఒక కట్ట మాత్రమే అందించారు. పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని నిలబడి రూ. 275 చెల్లించి ఒక కట్టను పొందారు. ఐదు నుండి పది ఎకరాల వరకు సాగు చేసే వారికి ఒక్క కట్ట యూరియా ఇస్తే ఏ విధంగా సరిపోతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నెల్లిమర్ల మండలంలోని సతివాడ సత్యనారాయణ ట్రేడర్స్, నెల్లిమర్ల మన గ్రోమోర్ షాపుల్లో అధికారులు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో యూరియా అమ్మకాలు జరిగాయి. సతివాడ సత్యనారాయణ ట్రేడర్స్ మాత్రం ఒక్కొక్క బస్తా మీద రూ. 30 నుంచి రూ. 40 అదనపు ధరకు అమ్మడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పల్నాడు జిల్లాలోని మండల కేంద్రమైన ముప్పాళ్లలో యూరియా కోసం బారులు తీరారు. క్యూలైన్లలో తోపులాట తలెత్తింది. జిల్లా కేంద్ర మార్కెటింగ్ సొసైటీ (జిడిసిఎంఎస్) ఎరువుల కేంద్రానికి రెండ్రోజుల కిందట 440 బస్తాల యూరియా వచ్చింది. మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సోమేశ్వరరావు అక్కడికి చేరుకుని అందరికీ సర్దిచెప్పి సజావుగా విక్రయాలు సాగేలా పర్యవేక్షించారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున విక్రయించారు. రైతులు అన్నం నీళ్లు మానుకుని, ఆధార్‌కార్డు కాపీలు చేతిలో పట్టుకుని ఎండలోనే గంటల తరబడి నిరీక్షించారు. మరికొందరు రైతులు ఎరువుల కోసం వచ్చినా అప్పటికే ఉన్న పెద్ద క్యూను చూసి వెనుదిరిగి వెళ్లిపోయారు. కొంతమంది చివరి వరకూ నిరీక్షించినా యూరియాను దక్కించుకోలేకపోయారు. మొత్తంగా ఉట్టిచేతుల్తో వెనుదిరిగిన వారి సంఖ్య వందకుపైగా ఉంటుంది.

అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం కెజె.పురం పిఎసిఎస్ కార్యాలయానికి శుక్రవారం 22 టన్నుల యూరియా వచ్చింది. ఈ విషయం తెలిసి శనివారం తెల్లవారు నాలుగు గంటల సమయానికే రైతులు పిఎస్‌సిఎస్ ప్రాంగణంలో బారులుతీరారు. ఒక్కొక్క రైతుకు ఒక్క యూరియా కట్ట మాత్రమే ఇస్తామని, ఆధార్, వన్‌బి తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు చెప్పడంతో క్యూ యూరియా కట్ట మాత్రమే ఇస్తామని, ఆధార్, వన్‌బి తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు చెప్పడంతో క్యూ లైన్‌లో ఉన్న రైతన్నలు ఆధార్, వన్‌బి కోసం పరుగులు తీశారు. క్యూలైన్లలో కాసేపు గందరగోళ వాతావరం నెలకొంది. విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారి అనసూయ, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ కొంకి అప్పారావు, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న మాల్యాద్రి

తురకపాలెంలో క్వారీ నీటిని పరీక్షించాలి

- మృతుల్లో 26 మంది ఎస్‌సి కాలనీ వాసులే
- గ్రామాన్ని సందర్శించిన కెవిపిఎస్ బృందం

ప్రజాశక్తి-గుంటూరు

తురకపాలెంలో ప్రజలకు సరఫరా చేసిన క్వారీ నీటిని పరీక్ష చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. శనివారం కెవిపిఎస్ బృందం ఈ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాల్యాద్రి మాట్లాడుతూ నెలక్రితం వరకూ క్వారీలో నీటిని ప్రజలకు సరఫరా చేశారని తెలిపారు. గ్రామంలో 16 చోట్ల నీటిని పరీక్షించిన ప్రభుత్వం, క్వారీలో నీటిని మాత్రం పరీక్షించలేదన్నారు. మృతులలో అత్యధికంగా 26 మంది ఎస్‌సి కాలనీ వాసులు ప్రజలు ఉన్నారని, తక్షణమే క్వారీ నీటినీ పరీక్షించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, వైద్యం పొందుతున్న వారి ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరించాలని కోరారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని హెల్త్ క్లినిక్‌ను బలోపేతం చేయాలని, వైద్యశిబిరాన్ని కొనసాగించాలని కోరారు. గ్రామంలో పారిశుధ్యం, రోడ్లు సరిగాలేవన్నారు. ఇతర ప్రాంతాల నుండి కార్మికుల్ని రప్పించి నీటిని శుభ్రం చేయించడంతోపాటు నిరంతర పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సుగాలి ప్రీతి కేసు విషయంలో ఆమె తల్లి న్యాయం అడిగినందుకు జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు బెదిరింపు ధోరణిలో మాట్లాడడం సరికాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సుగాలి ప్రీతి కేసును ఎన్నికల స్టంట్‌గా ఉపయోగించుకున్న పవన్ అధికారంలోకి రాగానే ఎందుకు న్యాయం చేయట్లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె నవీన్‌ప్రకాష్, ఉపాధ్యక్షులు జి లూథర్‌పాల్, నాయకులు జె వెంకటస్వామి, సిఐటియు నగర కార్యదర్శి బి ముత్యాలరావు, ఖాసిం షహీద్ ఉన్నారు.

గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న సురేంద్ర తదితరులు

హైడ్రో ప్రాజెక్టుల ఒప్పందాలు రద్దు చేయండి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణ ఒప్పందాలను, జిఒ 51ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ మజ్జి సురేష్ కుమార్, కో-కన్వీనర్ మజ్జి కృష్ణంరాజు, బూర్జ ఎంపిటిసి మజ్జి హరి, కమిటీ సభ్యులు కొర్ర బొంజుబాబు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలోని చిట్టంవలస, కుసుమవలస, గుజ్జేలి, పెదకోటల్లో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి జిఒ 51ని విడుదల చేసిందని తెలిపారు. ఈ క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణానికి చేస్తున్న సర్వేలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీసా, గ్రామ సభ తీర్మానం లేకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం ఎలా చేస్తారన్నారు. చిట్టంవలస, కుసుమవలస వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం డ్యాం చేపడితే బూర్జ, వెంగడ, వాలసి, పెదబిడ్డ, టోకూరు, బస్కీ పంచాయతీల్లోని గ్రామాలు, అనంతగిరి మండలం గుజ్జేలిలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడితే లోతేరు, గుమ్మకోట పంచాయతీ పరిధిలోని 120 గిరిజన గ్రామాల్లోని 10 వేల మంది ఆదివాసిలు జలసమాధి అవుతారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఒప్పందాలు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్నబాబు, బూర్జ పంచాయతీ గ్రామస్తులు, పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో 77 వేల టన్నుల ఎరువులు

- సిఎం చంద్రబాబు
- రబీకి వెబ్‌ల్యాండ్, ఇ-పంట ఆధారంగా ఎరువులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎరువుల సరఫరా సక్రమంగా జరుగుతోందని, రైతులకు డిమాండు మేరకు అందుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎరువుల లభ్యత, సరఫరా అంశంపై జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, వ్యవసాయశాఖ అధికారులతో సిఎం శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువుల సరఫరాపై ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమీక్ష నిర్వహించారు. అధికారులు ఇచ్చే సమాచారంతోపాటు ఆయా జిల్లాల నుంచి తెప్పించుకున్న సమాచారాన్ని పోల్చి ఎంత స్థాయిలో అందుబాటులో ఉన్నాయో వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 77,396 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో 10 రోజుల్లో 41 వేల టన్నుల ఎరువులు రాష్ట్రానికి అదనంగా రానున్నాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

బాపట్ల, కృష్ణా, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరత ఉందని, ఆ సమస్యను పరిష్కరించేందుకు ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. సమస్యను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నుంచి జిల్లా కలెక్టరు వరకూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎరువుల సరఫరాను పరిశీ లించాలన్నారు. ఎరు వుల లభ్యత గురించి రైతులకు వివరించి వాళ్లు ఎటువంటి ఇబ్బందీ పడకుండా చూడా లన్నారు. అందరికీ ఎరువులు అందుతాయనే భరోసాను రైతులకు కలిగించాలని చెప్పారు. వచ్చే రబీలో వెబ్‌ల్యాండ్, ఇ-పంట అనుసంధానంతో రైతుల ఆధార్ ఆధారంగా ఎరువుల సరఫరా చేపట్టాలని సిఎం తెలిపారు. దీనికోసం ఇప్పటి నుంచే సమాయత్తం కావాలన్నారు. ఎవరు ఎంత పంట వేస్తారో ఇ-పంట నమోదు ద్వారా చూసి వారికి అవసరమైన మేరకు ఎరువులు ఇచ్చే మెకానిజం తీసుకురావాలని అన్నారు. కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి బాధ్యత తీసుకుని రైతులకు ఎరువుల సరఫరాపై అవగాహన కల్పించడాన్ని ముఖ్యమంత్రి ప్రసంశించారు. అన్ని జిల్లాల్లో ఈ తరహా కార్యక్రమం చేపట్టి ఎరువులు సరఫరాలో ఉన్న అన్ని అనుమానాలనూ తొలగించాలన్నారు.

ఎంపి మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్

- 11న లొంగిపోవాలని షరతు
- మరో ముగ్గురికి బెయిల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, రాజమహేంద్రవరం ప్రతినిధి

మద్యం కేసులో నలుగురు నిందితులకు స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మందిని సిట్ అధికారులు అరెస్టు చేయగా వారిలో నలుగురికి బెయిల్ శనివారం వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జైలులో రిమాండ్ ఖైదీగా ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి శనివారం విజయవాడ ఎసిబి కోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు వీలుగా కోర్టు అనుమతినిచ్చింది. తిరిగి ఈ నెల 11న సాయంత్రం 5 గంటలలోపు రాజమండ్రి సెంట్రల్ జైలులో సరెండర్ కావాలని ఎసిబి కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎంపి మిథున్ రెడ్డి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ఇదే కేసులో కీలక నిందితులుగా సిట్ భావిస్తున్న వారిలో ఎ-31 ధనంజయ్‌రెడ్డి, ఎ-32 కృష్ణమోహన్‌రెడ్డి, ఎ-33 బాలాజీ గోవిందప్పకు ఎసిబి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరు రూ.లక్ష, రెండు పూచీకత్తులు చొప్పున షూరిటీ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ ముగ్గురు నిందితులు విదేశాలకు వెళ్లకుండా వారి పాస్‌పోర్టులు అందించాలని పేర్కొంది.

తాడిపత్రికి కేతిరెడ్డి పెద్దారెడ్డి

- భారీ బందోబస్తు నడుమ తన ఇంటికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దాదాపు 15 నెలల తర్వాత అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామం తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దారెడ్డిని తాడిపత్రికి రానివ్వబోమంటూ మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై పెద్దారెడ్డి హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారు. పలుమార్లు తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించినా శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందన్న కారణంతో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డిని తాడిపత్రికి పంపే బాధ్యతను జిల్లా పోలీసులు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. శనివారం ఉదయం జిల్లా ఎస్‌పి జగదీష్ పర్యవేక్షణలో దాదాపు 300 మంది పోలీసులు తాడిపత్రిలోని ఇంటికి తీసుకువెళ్లారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గట్టి బందోబస్తు నిర్వహించారు. తన ఇంటికి వెళ్లిన అనంతరం పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను ప్రజాస్వామ్యబద్ధంగానే నడుచుకుంటానని, తాడిపత్రిలో శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. ప్రస్తుతం పోలీసుల ఆంక్షలు ఉన్నాయని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ తన ఇంటి వద్దకు రావొద్దని కోరారు. కొద్దిరోజుల తర్వాత తానే ప్రతి కార్యకర్త వద్దకు వచ్చి కలుసుకుంటానని తెలిపారు.

రైతు సమస్యలపై ప్రభుత్వం మొద్దునిద్ర

- 9న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
- పోస్టర్ ఆవిష్కరణలో సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు సమస్యలపై కూటమి సర్కారు మొద్దునిద్ర పోతోందని, నిరసనగా ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడం ద్వారా ప్రభుత్వం కళ్ళు తెరిపించాలని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైసిపి ఆధ్వర్యాన చేపట్టనున్న అన్నదాత పోరు పోస్టర్‌ను శనివారం తాడేపల్లి వైసిపి కార్యాలయంలో సజ్జల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి నేతల కనుసన్నల్లోనే యూరియా బ్లాక్ మార్కెట్ దందా నడుస్తోందని ఆరోపించారు. అడిగిన రైతులను వేధిస్తోందని, రాష్ట్రంలో అన్ని పంటలకూ గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహించడం ద్వారా సర్కారు మెడలు వంచుతామని, వారికి న్యాయం జరిగే వరకూ ఊరుకునేది లేదని అన్నారు. 9న రాష్ట్రంలో ఉన్న అన్ని ఆర్‌డిఒ కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించాలని, టమాట, ఉల్లి, చినీ, బొప్పాయితోపాటు రైతులు పండించే అన్ని పంటలకూ మద్దతు ధర చెల్లించాలని కోరారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి మార్కెట్లో పోటీ పెంచాలన్నారు. ప్రైవేటు వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ఒప్పించి రైతులకు అండగా నిలవాలని కోరారు. యూరియా కోసం డిపోల వద్ద కిలోమీటర్ల దూరం క్యూలైన్లు ఏర్పాటవుతున్నాయని పేర్కొన్నారు. యూరియా ఇవ్వలేని ఉప ముఖ్యమంత్రి కేస్సర్ వస్తుందంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి వెలంపల్లి, మాజీ ఎంపి నందిగం సురేష్, పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు టిజెఆర్ సుధాకర్‌బాబు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పలువురు పాల్గొన్నారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు చంద్రబాబు పచ్చజెండా : విడదల రజిని

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు సిఎం చంద్రబాబు పచ్చజెండా ఊపారని మాజీ మంత్రి విడదల రజిని విమర్శించారు. ఆరోగ్యశ్రీలో ఇన్సూరెన్స్ విధానానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఇది పూర్తిగా ప్రజావైద్య రంగాన్ని నిర్వీర్యం చేయడమేనని పేర్కొన్నారు. రూ.8,500 కోట్ల వ్యయంతో చేపట్టిన 17 కొత్త మెడికల్ కళాశాలల్లో ఐదు ప్రారంభమయ్యాయని వివరించారు. ఈ ఏడాది ప్రారంభానికి మరో ఐదు సిద్ధంగా ఉన్నాయని, వాటిని ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.

వ్యవసాయ కార్మికుల వెతలు తీరేదెన్నడో?

- 2013 భూసేకరణ చట్టం అమలుకు నోచని వైనం
- కడపలో 8, 9, 10వ తేదీల్లో వ్య.కా.స జాతీయ కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులు సమస్యల వలయంలో కూరుకుపోయారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాయలసీమ జిల్లాలో సోలార్, విండ్, హైడ్రో పంప్డ్ స్టోరేజీ పరిశ్రమలకు పెద్దఎత్తున రైతుల భూములను ధారాదత్తం చేస్తోంది. ఫలితంగా భూములు కోల్పోయిన రైతులు కూడా వ్యవసాయ కార్మికులుగా మారిపోతున్నారు. కడపలో ఈ నెల 8, 9, 10వ తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ నిర్వహిస్తోంది. వ్యవసాయ కార్మికుల సమస్యలపైనా చర్చించడం, ప్రణాళికలు రూపొందించడం, అమలుకు గల అవకాశాలపై దృష్టి సారించే అంశాలను ఈ కౌన్సిల్‌లో చర్చించనున్నారు.

రాయలసీమలో అధికాంగా వరి, వేరుశనగ, పత్తితోపాటు పెద్దఎత్తున ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. పరిశ్రమల పేరుతో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో భాగంగాకార్పొరేట్లకు టిడిపి కూటమి సర్కారు లక్షలాది ఎకరాల భూములను ధారాదత్తం చేసింది. ఫలితంగా 50 లక్షల మందికి ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది మరో ఐదు లక్షల ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని లక్ష్యంగా పెట్టుకోవడంతో 1.50 కోట్ల మందికి ఉపాధి గల్లంతు కానుంది. భూములను కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించడం లేదు. కడప, కర్నూలు, అన్నమయ్య జిల్లాల్లో భూములు ఆక్రమించుకున్న ఆక్రమణదారులకు, స్థానికులకు మధ్య ఘర్షణ నెలకొంది. స్థానికుల పోరాటాలకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా నిలిచింది. 70 వేల ఎకరాలను ఆక్రమించిన ఆక్రమణదారులతో వ్యవసాయ కార్మిక సంఘం ప్రత్యక్షంగా పోరాడుతోంది. ఇలాంటి తరహా పోరాటం కడప జిల్లాలోనే 20 వేల ఎకరాల్లో సాగుతోంది. ఆక్రమణదారులతో వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం నేపథ్యంలో పోరుమామిళ్లకు చెందిన వెంబడి పోలయ్యపై ఆక్రమణదారులు దాడికి సైతం తెగబడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉధృత పోరాటం నేపథ్యంలో కడప జిల్లాలోనే 450 మందికి భూములు పంపిణీ చేయడం జరిగింది. చిత్తూరు జిల్లా కుప్పం ఎయిర్‌పోర్టు, కడప జిల్లాలోని ఎర్రగుంట్ల, ముద్దనూరు నుంచి కర్నూలు జిల్లాలోని శకునాల తదితర ప్రాంతాల్లో వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం చేస్తోంది. రాయలసీమ నుంచి అనేక మంది ముఖ్యమంత్రులు వచ్చినప్పటికీ సామాజిక వివక్ష కొనసాగుతోంది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలని, పనుల ప్రదేశాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని, ఉచిత విద్య, వైద్యం కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతోంది.

కాలువలో జారి చిన్నారి మృతి

- తల్లి బహిర్భూమికి తీసుకెళ్లిన సమయంలో ఘటన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తల్లి తనతోపాటు బహిర్భూమికి తీసుకెళ్లిన ఆరు నెలల చిన్నారి కాలువలో జారి ప్రాణాలు కోల్పోయిన ఘటన చిత్తూరు జిల్లా తిరుపతిలోని కొరమేను గుంటలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొరమేను గుంటకు చెందిన భూపతి భార్య, తన ఆరు నెలల చిన్నారితో కలిసి నివసిస్తున్నాడు. భార్య తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్తూ కుమార్తెను కూడా తీసుకెళ్లింది. అక్కడ కాలువ దాటుతుండగా చిన్నారి కాలువలో పడిపోయింది. అయితే ఈ విషయాన్ని ఇంట్లో చెప్పేందుకు భయపడి పాప కనిపించడం లేదంటూ భర్తకు చెప్పింది. వెంటనే తండ్రి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మూడు ప్రత్యేక బృందాలతో జిల్లావ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు అక్కడ పరిస్థితులను పరిశీలించారు. సిసి కెమెరాల ద్వారా ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులను నిలదీయగా చిన్నారి తల్లి అసలు విషయం పోలీసులకు తెలిపింది. దీంతో, పోలీసులు కాల్వలో గాలించడంతో చిన్నారి మృతదేహం బయటపడింది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బహిరంగ ప్రకటన

M. మునిరాణి W/o M. గురుమూర్తి కలికిరి మండలం, కలికిరి వారి తరపున తెలియజేయడం ఏమనగా !

నా క్లయింట్ స్థిరాస్తికి సంబంధించి లింక్ ఒరిజినల్ డాక్యూమెంట్ నెంబరు 1053/1989 తను జిరాక్స్‌కు తీసుకుని వెళ్ళి తిరిగి యింటికి వచ్చు మార్గంలో సదర పత్రమును తేది 20.07.2025వ రోజున పోగొట్టుకుంది. సదరు పత్రము ఎంత వెతికినను దొరకలేదు. ఆవిషయమై ఎస్.ఐ. కలికిరి మండలం పోలీసు వారికి కంప్లైంట్ ఇవ్వడం జరిగినది. సదరు ఒరిజినల్ డాక్యూమెంట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ లేక నా క్లయింట్కు గానీ ఇవ్వవలసినది. అట్టు కాకుండా సదరు పత్రము పై ఎలాంటి విక్రయ,